ప్రభ, 29-3-1979, పుట : 4,  జి. రామలక్ష్మి - హైదరాబాదు

## రాముడి తెలివి

యమునా నదీ తీరంలో ఒక చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఒక వయసు మళ్ళిన ముసలమ్మ ఉంది. ఆమెకు ఒక కొడుకూ, ఒక కూతురూ ఉన్నారు. కొడుకు పేరు రాముడు, కూతురుపేరు వనజ. కూతురికి వావాహం చేయడంకోసం ఆ ముసలమ్మ ఎంతో కాలం నుంచి కష్టపడి పనిచేస్తూ, కూడబెట్టిన డబ్బు ఒక సంచిలో దాస్తూ వచ్చింది.

అది తెలిసిన ఒక దొంగ ఒకనాడు ఎవ్వరూ లేని సమయం చూసి ఇంట్లో జొరబడి ఆ డబ్బున్న సంచీని కాజేశాడు. తన సంచీ కనపడక పోవటంతో ఆ ముసలమ్మ లబో దిబోమని ఏడవసాగింది.

తల్లిని ఓదారుస్తూ రాముడు, ''అమ్మా ఏడవకమ్మా! ఎలాగయినా ఆ దొంగను పట్టుకుని, ఎలాగయినా సరే మన సొమ్మును తీసుకువస్తాను. అంత వరకు నేను ఇంటికి వస్తే, నా పేరు రాముడే కాదు!'' అని చెప్పి, తల్లి ఎంత చెప్పినా వినకుండా బయలుదేరాడు.

అలా అతడు చాలా దూరం వెళ్ళి వెళ్ళి ఒక చెట్టునీడన ఉన్న బావి గట్టుమీద కూచున్నాడు. అంతలో వెతకబోయిన తీగ కాలికే చుట్టుకుందన్నట్లుగా దొంగ తను కాజేసిన ముసలమ్మ సంచీని ఆనందంగా ఊపుకుంటూ ఆ దారినే రాసాగాడు. ఆ దొంగ ఇల్లు కూడా ఆ దారిలోనే ఉంది. ఆ దొంగ చేతిలో తమ డబ్బుగల సంచీని చూసి, 'దొంగపెదవా, మా డబ్బు కాజేసిందికాక హుషారుగా ఈల వేసుకుంటూ పోతున్నావా? ఉండు నీ పని పడ్తాను! అని అనుకుని, గట్టిగా రాగాలు తీస్తూ దొంగకు వినిపించేలా ఏడవటం మొదలుపెట్టాడు.

అది విని దొంగ వెనక్కు వచ్చి, ''ఎందుకు బాబూ ఏడుస్తున్నావు? ఏం'' జరిగింది?'' అని అడిగాడు ఆత్రుతగా.

''మా అమ్మ ఒక బంగారు గొలుసు ఇచ్చి, దానిని అమ్మి డబ్బు తీసుకురమ్మంది. సరేనని వస్తూంటే దారిలో ఈ బావి కనబడిరది. ఇందులో నీళ్ళున్నాయో లేవోనని తొంగిచూశాను. ఇంతలో ఆ గొలుసు కాస్తా నా జేబులోంచి జారి ఈ బావిలో పడిరది. అది రెండువేలు విలువ చేసే గొలుసు. అది లేకుండా నేను బజారుకు వెళ్ళలేను. బజారులో దానిని అమ్మి సొమ్ము తేకుంటే మా అమ్మ నన్ను చంపేస్తుంది'' అంటూ మళ్లీ నడవసాగాడు.

అది విని అబ్బ ఈ వేళ నేను లేచిన రోజు చాలా మంచిదిలా ఉంది. అవతల ఆ డబ్బు. ఇక్కడ ఈ గొలుసు వారెవ్వా! నా అదృష్టం పండిరది. ఎలాగయినా ఈ బావిలోకి దిగి ఆ గొలుసును వెతికి దాచేసి దొరకలేదని చెప్తేసరి. వాడు ఏడుస్తూ వెళ్ళిపోతాడు. అప్పుడు నేను తీసేసుకోవచ్చు!' అని అనుకుని సంతోషపడ్డాడు.

ఈ సంచినీ, నా బట్టలను జాగ్రత్తగా చూస్తుండు! నేను బావిలోకి దిగి నీ గొలుసు ఉందేమో చూసి తీసుకువస్తాను సరేనా?'' అని చెప్పి బట్టలూ, డబ్బు సంచీ రాముడు చిన్న పిల్లాడేకదా అని నమ్మి ఇచ్చి, గోచీ కట్టుకుని బావిలోకి దిగాడు. తన ఎత్తు పారిందని రాముడు చాలా సంతోషించాడు. ఆ దొంగ లోపలికి దిగిన వెంటనే రాముడు ఆ సంచీ తెరిచి చూవాడు. డబ్బు సరిగ్గానే ఉంది. వెంటనే ఆ సంచీని బట్టలను తీసుకుని ఆగకుండా కాలి సత్తువ కొద్దీ పరుగుతీశాడు.

ఎంత వెదికినా బావిలో గొలుసు కనబడకపోయేసరికి విసుగెత్తి దొంగ పైకి వచ్చేశాడు. పైకి వచ్చి చూసేసరికి వాడి గుండె గుబేలు మంది. అక్కడ ఆ పిల్లాడూ లేడు, సంచీ లేదు. కనీసం బట్టలు కూడా లేవు! అయ్యో ఆశకు పోయి ఉన్నదికూడా పోగొట్టుకున్నానే. చివరికి ఒంటిమీద గుడ్డలు కూడా పోయాయే! అని విచారించి, తన దారిన తాను వెళ్ళిపోయాడు.

రాముడు సంతోషంతో ఇంటికి వచ్చి తల్లిని పిలిచి జరిగిందంతా చెప్పాడు.

కొడుకు తెలివికి ఆ ముసలమ్మ ఎంతగానో ఆనందించింది!!.